శివోహం

» నేటి నుంచి కార్తీక మాసం



(ఆరో పేజీలో..)

కరువు భత్యం జీవోలపై..

ఉద్యోగుల కన్నెర్ర

» సీఎం చెప్పిన దానికి విడుదలైన జీవోలకు సంబంధం లేదని సంఘాలు అభ్యంతరం

» జీవోలు 60, 61 సవరించాలని డిమాండ్

నిడమర్రు/ఏలూరు అర్బన్/ఏలూరు రూరల్/పెదవేగి/పెనుమంట్ర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):దీపావళి కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఒక కరువు భత్యం(డీఏ)ను ప్రకటించింది. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. తీరా విడుదలైన జీవోలు 60, 61లను చూసి కన్నెర్ర చేస్తున్నారు. ఇప్పుడు అమలవుతున్న కరువు భత్యం 33.67%కు అదనంగా ఒక్క డీఏ 3.64% ప్రకటించడంతో ప్రస్తుతం కరువుభత్యం 37.31%గా మారనుంది. ఈ డీఏను 2025 అక్టోబరు నుంచి ఇవ్వనున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. జీవోల ప్రకా రం 1.1.2024 నుంచి 30.9.2025 వరకు రావాల్సిన 21 నెలల డీఏ బకాయిలు బకాయిలను ఉద్యోగి తీసుకోవాలంటే రిటైర్ కావాల్సిందే. ఉద్యోగి రిటైర్‌మెంట్ రోజున డీఏ బకాయిలు చెల్లిస్తామని జీవోల్లో పేర్కొనడంపై ఆయా సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వం డీఏ బకాయిల చెల్లింపులో ఖజానా మీద భారం పడకుండా మధ్యేమార్గంగా ఉద్యోగుల పీఎఫ్ ఖాతాల్లో చెల్లించడం రివాజు. గతంలో రెండు, మూడు దఫాలుగానైనా చెల్లించేవారు. దీనికి భిన్నంగా డీఏ బకాయిలన్నీ ఉద్యోగి చనిపోయిన తర్వాత బెని ఫిట్స్‌తోనో, లేదా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌తోనే ఇస్తామని చెప్పడం దారుణమని ఉద్యోగ వర్గాలు నిరసిస్తున్నాయి. ఒక్కో ఉద్యోగి డీఏ బకాయిల కింద రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పొందాల్సి వుంది. జీవో 60, 61 పరిశీలిస్తే సీపీఎస్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు ప్రస్తావనలేదు. రిటైర్ అయిన ఉద్యోగులకు 2027-28లో 12 వాయిదాల్లో ఈ బకాయిలు చెల్లిస్తామని చెప్పడాన్ని ఉద్యోగ సంఘాలు నిరసిస్తున్నాయి. నాలుగు డీఏలు ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం ఒక్క డీఏ ఇచ్చి, అది కూడా (మిగతా 8వ పేజీలో)

జీవోల్లో సవరణలకు సంకేతాలు

ఉద్యోగ సంఘాల అభ్యర్థన, డిమాండ్ల మేరకు డీఏ చెల్లింపు జీవోలు 60, 61 మార్గదర్శకాల్లో సవరణలు ఒకటి, రెండు రోజుల్లో చేయనున్నట్టు సంకేతాలు వచ్చాయి. ఆ మేరకు రెగ్యులర్, సీపీఎస్ ఉద్యోగులతోపాటు పెన్షనర్లకు కలిపి 2027-28 ఆర్థిక సంవత్సరం వరకు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా మూడు సమాన వాయిదాల్లో డీఏ బకాయిలు చెల్లించేలా సవరణ జీవోలు విడుదల కానున్నట్టు తెలిసింది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి వుంది.



ప్రభుత్వ ఉద్యోగులు (ఫైల్)





అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్ తదితరులు

పోలీస్ అమరవీరులకు నివాళులు అందరి బాధ్యత

» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు నివాళులు అర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప శివకిశోర్‌తో కలిసి ఐజీ పోలీసు అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా ఈఏడాది విధి నిర్వహణలో అమరులైన వీరుల పేర్లను ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు చదివి వినిపించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఐజీ మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు తమ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో కృషి చేస్తున్న పోలీసులు రియల్ హీరోస్ అంటూ వారి త్యాగాలను కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది అమర వీరులుకు స్మృతి పరేడ్‌ను నిర్వహిం చారు. అనంతరం పరేడ్ గ్రౌండ్ నుంచి నిర్వహించిన ర్యాలీని ఐజీ, కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, డీటీసీ డీఎస్పీ వరప్రసాదరావు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏవో మస్తాన్, పోలీసు ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, అశోక్ కుమార్, కోటేశ్వరరావు, పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం.. జోరు వర్షాలు

ఏలూరుసిటీ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 31.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 5.4 మి.మీగా నమోదైంది. పెదవేగి 26.4, ముసునూరు 25.4, బుట్టాయిగూడెం 15.4, నూజివీడు 13.2, కలిదిండి 12.6, భీమడోలు 5.8, జంగారెడ్డిగూడెం 2.8, కామవరపుకోట 2.8, చాట్రాయి 2.6, లింగపాలెం 2.2, టి.నరసాపురం 2, దెందులూరు 1.8, కైకలూరు 1.6, ఆగిరిపల్లి 1.6, పోలవరం 1.6, చింతలపూడి 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

కుంతలగూడెం పంచాయితీ!

» కార్యాలయ నిర్మాణంపై రెండు గ్రామాల మధ్య వివాదం



కొయ్యలగూడెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కుంతలగూడెం పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం రెండు గ్రామాల మధ్య వివాదాన్ని తెచ్చి పెట్టింది. చివరకు హైకోర్టు వరకు వెళ్లింది. గత వైసీపీ ప్రభుత్వంలో కుంతలగూడెం, కనకాద్రిపురం గ్రామాలను కలిపి కుంతలగూడెంను పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయితే పంచాయతీ కార్యాలయాన్ని కనకాద్రిపురంలో ఏర్పాటు చేయడంతో గత ఐదేళ్లుగా అక్కడే కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాకా పంచాయతీ నిర్మాణానికి రూ.32 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కుంతలగూడెం గ్రామస్థులు పంచాయతీ కార్యాలయాన్ని తమ గ్రామంలోనే నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఐదేళ్లుగా తమ గ్రామం నుంచే పంచాయతీ కార్యాకలాపాలు కొనసాగుతున్నందున కొత్త పంచాయతీ కార్యాలయం తమ ఇక్కడే నిర్మించాలంటూ కనకాద్రిపురం గ్రామస్థులు పట్టుబడుతున్నారు. ప్రజాప్రతినిధులు (మిగతా 8వ పేజీలో)

తీపి కబురు

» ఆర్టీసీలో పదోన్నతుల కల్పనకు జీవో 40 జారీ

» జిల్లాలో 125 మందికి పైగా ఉపయుక్తం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆరేళ్లపాటు పదోన్నతుల కోసం ఎదురు చూసిన ఆర్టీసీ (ప్రజారవాణా) ఉద్యోగుల జీవితాల్లో టీడీపీ ప్రభుత్వం దీపావళి వెలుగులను తీసుకొచ్చింది. కిందిస్థాయి ఉద్యోగులకు పదోన్నతుల కల్పనకు జీవో 40ను సోమవారం విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం 2020లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసింది. సర్వీసు రూల్స్ నుంచి పదోన్నతుల వరకు ఉద్యోగులకు కష్టాలతో కాలం గడిపేసింది. వారు దాచుకున్న డబ్బులను వాడేసుకుంది. ఆర్టీసీ ఆస్తులను తనఖా పెట్టేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాకా ప్రజా రవాణా ఉద్యోగుల బాధలను, ఆవేదన అర్థం చేసుకుని 16 నెలల్లోనే వారికి పదోన్నతుల కల్పనకు ఇటీవల కేబినెట్ సమావేశం చర్చించి, ఆమోదించిన మరుసటి రోజునే జీవో జారీ చేసి ఉద్యోగులకు తీపి కబురును అందించింది. జిల్లాలో అసిస్టెంట్ డిపో క్లర్క్ నుంచి బస్సు డ్రైవర్లు, కండక్టర్లు,అసిస్టెంట్ మెకానిక్, వివిధ కేడర్‌ల్లో 125 మందికి పైగా ఉద్యోగులు ప్రయోజనం చేకూరనుందని అంచనా వేస్తున్నారు. సర్వీసులతో సంబంధం లేకుండా ఎక్కడ ఖాళీలుంటే అక్కడ కొత్తగా ఆయా స్థానాల్లో పదోన్నతులు కల్పించనున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తారని చెబుతున్నారు.

ఇది శుభపరిణామం



చాలాకాలం తర్వాత కూటమి ప్రభుత్వంలో పదోన్నతుల కల్పనకు అడుగులు వేయడం శుభపరిణామం. గత ఐదేళ్ల పెండింగ్‌లో 1/19 సర్క్యులర్‌ను ఈ ప్రభుత్వం తిరిగి అమలు చేయాలి. ఉన్న దీనిని సత్వరం అమలు చేయాలి.

వై.శ్రీనివాస్, ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు డిపో గౌరవాధ్యక్షుడు

బాణసంచాకు.. ధరాఘాతం

» జిల్లాలో 270 లైసెన్సుల ద్వారా విక్రయాలు

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో రూ.20 కోట్లలోపే వ్యాపారం

» వర్షాలతో పాటు జీఎస్టీ ప్రభావం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ ఏడాది దీపావళికి బాణసంచా వ్యాపారం అంతగా జరగలేదు. బాణసంచా అమ్మకాలపై అల్పపీడనం ఎఫెక్టు పడింది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో రూ.20 కోట్లు లోపే అమ్మకాలు జరిగినట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ఏలూరు నగరంలో 44 షాపుల ద్వారా రోజుకు కనీసం రూ.ఐదు లక్షలు వ్యాపారం చేయలేకపోయామని ఒక వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి కైకలూరు తదితర ప్రాంతాల్లో కలిపి మొత్తం 270 లైసెన్సుడ్ బాణసంచా దుకాణాల ద్వారా అమ్మకాలకు మూడు రోజుల పాటు అనుమతు లిచ్చారు. తొలిరోజు 18న షాపులను సర్దుకోవడంతో సరిపోయింది. 19న భారీ వర్షాలతో సరుకు అమ్ముడుపోలేదు. 20వ తేదీ దీపావళి రోజు సోమవారం నాడే వినియోగదారులు కొనుగోలు చేశారు. కేంద్రం బాణసంచాపై జీఎస్టీని తగ్గించకుండా 28 శాతం అమలు చేయడంతో ధరల్లో తగ్గుదల కన్పించలేదు. దీంతో మధ్య తరగతి ప్రజలు మందుగుండు సామగ్రి వైపు తొంగి చూడలేదు.

కాలుష్య కారకాలపై పీసీబీ పరీక్ష.



జిల్లాలో మందుగుండు సామగ్రి కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగు తుందన్న అంచనాలపై జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) ఇంజనీర్ కె.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఏలూరు, నూజి వీడులో కాలుష్య కారకాలపై పరీక్షలు జరిపారు. సౌండ్ పొల్యూషన్ పరిశీలించే యంత్రం (నోయిస్ మీటర్) లతో పరీక్షలు జరి పారు. గతేడాది కంటే ఈ ఏడాది బాణసంచా వినియోగం తగ్గినట్టు గుర్తించామని ఈఈ తెలిపారు. వాయు కాలుష్యం ఎంత ఉందన్న విషయంపై పరీక్షల శాంపిల్స్‌ను వైజాగ్ ల్యాబొరేటరీకి పంపామన్నారు.

శివోహం

- నేటి నుంచి కార్తీక మాసం
- ముస్తాబైన శివాలయాలు
- విద్యుత్ దీపాలతో అలంకరణ
- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- భక్తులకు ఏర్పాట్లు





మద్ది క్షేత్రంలో కార్తీక మహోత్సవాలు



జంగారెడ్డిగూడెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం నుంచి కార్తీక మాస మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో ఈవో ఆర్వీ.చందన ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

అక్టోబరు 26, నవంబరు 2,9,16 తేదీల్లో హోమాలు, సువర్చలా హనుమద్ కల్యాణం.

అక్టోబరు 27, నవంబరు 3, 10, 17 తేదీల్లో లక్ష తమలపాకుల పూజలు.

అక్టోబరు 22, 29, నవంబరు 5, 12, 19 తేదీల్లో లక్ష పుష్పార్చనలు.

అక్టోబరు 25, నవంబరు 1, 8, 15 తేదీల్లో పంచామృత అభిషేకాలు.

నవంబరు 18న స్వామి వారి పుష్కరిణిలో విశేష తెప్పోత్సవం.

క్షీరా రామంలో కార్తీక శోభ

పాలకొల్లు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. ఆలయానికి ఇరువైపులా మెయిన్‌రోడ్డులో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇంకా పెద్ద పెద్ద ద్వారాలను ఏర్పాటు చేసారు. స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

చిన వెంకన్న క్షేత్ర పాలకుడి ఆలయంలో

ద్వారకాతిరుమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటుచేసి రంగులతో ముస్తాబు చేశారు. కార్తీక దీపాలను వెలిగించే ఉసిరి చెట్ల వద్ద పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయం

భీమవరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యనమదుర్రులో శక్తీశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల భక్తులు శక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారు. కార్తీక సోమవారాలలో అయితే భక్తులతో ఆలయం వద్ద క్యూ కడతారు. దిరుసుమర్రు గంగా భ్రమరాంబ రామలింగేశ్వరుడు భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

నరసాపురం మండలంలో..

నరసాపురం రూరల్: మండలంలో లక్ష్మణేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణంలో కపిలమల్లేశ్వరస్వామి, అమరేశ్వర, ఏకాంబరీస్వామి, రుస్తుంబాదా ఆలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ముస్తాబైన శైవ క్షేత్రాలు

మొగల్తూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. శివాలయాల్లో దర్శనానికి, అభిషేకాలకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి ప్రారంభమయ్యే కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి, వడయార్‌పేట వన మల్లికార్జునుడు, కొత్తపాలెం, పేరుపాలెం గ్రామాల్లో చంద్రమౌళేశ్వరస్వామి, ముత్యాలపల్లి ముక్తేశ్వరస్వామి, కాళీపట్నం కాళికేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి.



భీమవరం టౌన్/ద్వారకాతిరుమల/గణపవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. పాడ్యమి తిధి సూర్యోదయ సమయానికి ఉన్న రోజైన బుధవారం నుంచి కార్తీక స్నానాలు ఆచరించవచ్చని పండితుల మాట. నెలంతా పూజలు, ఉపవాసాలు, వ్రతాలు, వనభోజనాలు, ఆధ్యాత్మిక భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగుతాయి. వేకువజామునే చన్నీటి స్నానాలు, దీపారాధన, శివారాధనతో భక్తులు పరవశిస్తుంటారు. ఉల్లి, వెల్లుల్లి వంటి పదార్థాలు, మద్యం, మాంసానికి దూరంగా ఉంటారు. ప్రత్యేకంగా మహిళలు ఎంతో నిష్టగా పూజలు చేస్తారు. దీపారాధనలు, ఉపవాస దీక్షలు, కార్తీక పురాణ పఠనం చేస్తూ శివకేశవులను ఆరాధిస్తారు. కార్తీక పురాణంలో శివారాధన, దీపారాధన వైశిష్ట్యం, ఫలితాల గురించి విపులంగా ఉంటుంది. పరమశివునికి ప్రీతిపాత్రమైన కార్తీక సోమవారానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. కార్తీకమాస నెల రోజుల్లో సోమవారాలు, జ్వాలాతోరణం, శివుని ప్రాముఖ్యతను చాటితే బలిపాడ్యమి, ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి రోజుల శ్రీమహావిష్ణువును పూజిస్తారు. కార్తీక పురాణాల్లో మొదటి 15 అధ్యాయాలు శివుని, చివరి 15 అధ్యాయాలు విష్ణువు గురించి ఉంటుంది.





ముస్తాబైన గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం, నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం ఆలయంలో విద్యుత్ అలంకరణ

పరమ పవిత్రం కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి నాడు నదీస్నానం చేసి శివయ్యను విశేషంగా పూజిస్తారు. 365 వత్తులతో దీపారాధన చేసి ఆ పరమశివుని దర్శించుకుంటారు. పున్నమి వెలుగుల్లో కార్తీక దీపాలను వెలిగించి నదులు, పారే నీటిలో వదులుతారు. సోమవారాలు కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. కార్తీకంలో దీపారాధన ఎంతో మహిమాన్వితమైది అని నమ్ముతారు.

ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీక మాసం పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు వీలుగా క్యూలైన్లు, విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటుచేసారు. ఆచంట రామలింగేశ్వరస్వామి దేవస్థానం, నత్తారామేశ్వరం రామలింగేశ్వరస్వామి, జుత్తిగ ఉమా వాసుకీ రవి సోమేశ్వరస్వామి, పెనుగొండ నగరేశ్వరస్వామి, యనమదుర్రు శక్తీశ్వరస్వామి, సిద్ధాంతం, తణుకు, తాడేపల్లిగూడెం ఆలయాలు, ద్వారకాతిరుమల చిన్న వెంకన్న క్షేత పాలకుడు మల్లికార్జునస్వామి, జంగారెడ్డిగూడెం మద్ది క్షేత్రం, పట్టిసీమ క్షేత్రం, తదితర శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు.

ప్రత్యేక దీక్షలు.. పూజలు

కార్తీక మాసం అంటే గుర్తుచ్చే మరో అంశం... భక్తుల దీక్షలు. వివిధ దేవతామూర్తుల దీక్షలను ఈమాసంలోనే భక్తులు చేపడతారు. ఇందులో అయ్యప్ప దీక్ష, వెంకటేశ్వరదీక్ష, శివదీక్ష వంటివి దీక్షాధారులు ఎంతో భక్తిప్రపత్తులతో స్వీకరిస్తారు. అయ్యప్ప దీక్ష కార్తీక మాసం నుంచి మకర సంక్రాంతి వరకూ అయ్యప్ప మాలధారణ చేస్తారు. వైకుంఠ ఏకాదశి నాటికి దీక్షా విరమణ చేసేలా వెంకటేశ్వరుని దీక్షలు, శివరాత్రి, కార్తీకమాస పర్వ దినాల్లో శివ దీక్షలను భక్తులు కఠిన నియమాలతో కొనసాగిస్తారు. స్వామి చింతనలో సాత్విక జీవనాన్ని పాటిస్తారు. తెల్లవారుజామునే చన్నీటి స్నానం, భజనలు, పూజలతో గడుపుతారు. పాదరక్షలు సైతం వాడకుండా కటిక నేలపై నిద్రిస్తూ బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. ఇవన్నీ కార్తీక మాసంలోనే ప్రారంభమవుతాయి.



దీప దానం ప్రాముఖ్యత

కార్తీకమాసం పవిత్ర నదిలో లేదా పవిత్ర జలంలో బ్రహ్మముహూర్తంలో స్నానం చేయడం ఎంతో విశిష్టత ఉంది. మహిళలు ఉదయాన్నే స్నానమాచరించి దీపారాధన చేస్తారు. కార్తీక మాసంలో దీప దానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. పవిత్ర నది లేదా ఆలయం లేదా ఇంట్లో తులసి కోట వద్ద ప్రతీ రోజూ దీపం దానం చేయడం మంచిదని పురాణాలు చెబుతున్నాయి. జీవితంలో చీకటి తొలగి లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు.

కార్తీకంలో ముఖ్య పండుగలు

అక్టోబరు 22: కార్తీక మాస ప్రారంభం
23: యమవిదియ - భగినీ హస్త భోజనం
25: నాగుల చవితి
26: నాగ పంచమి
నవంబరు 1: కార్తీక శుద్ధ ఏకాదశి
2: క్షీరాబ్ది ద్వాదశి
5: జ్వాలా తోరణం, కార్తీక పూర్ణిమ
15: కార్తీక బహుళ ఏకాదశి
20: పోలిస్వర్గం కార్తీక మాసం ఆఖరిరోజు



నరసాపురం వలంధర్ రేవులో ఏర్పాటు చేసిన జల్లు స్నానం



సిద్ధాంతంలో కేదారేశ్వర ఘాట్



ఆచంట రామేశ్వరస్వామి ఆలయ రామగుండం

కార్తీక స్నానాలకు గోదావరి రేవులు సిద్ధం

నరసాపురం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం గోదావరిలో పుణ్యస్నానాలకు అనువుగా వలంధర్ రేవు మెట్లను శుభ్రం చేశారు. ఆర్చికి విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి దుస్తులు మార్చుకునే గదులు మరమ్మతులు చేశారు. రేవులో జల్లు స్నానం సిద్ధం చేశారు. వలంధర్, రాజుల్లంక, అమరేశ్వర రేవుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు.

ఆచంట(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో ఆచంటేశ్వరుడిని ప్రతీ రోజూ వేల సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. రామగుండం చెరువులో భక్తులు కార్తీక దీపాలు పెద్ద ఎత్తున వెలిగిస్తారు. రామగుండం చెరువును ఆలయ ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ, చైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు శుభ్రం చేయించారు.

పెనుగొండ(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన సిద్ధాంతం కేదార్‌ఘాట్ భక్తులకు కార్తీక మాస పుణ్యస్నానాలకు సిద్ధమైంది. రెండు రోజుల నుంచి స్థానిక పంచాయతీ సర్పంచ్ చింతపల్లి గనిరాజు, దేవస్థానం అధికారి ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్నానాల రేవుల ప్రక్షాళన చేపట్టారు. రేవులలో సీసా పెంకులు, చెత్తా చెదారాలను ఒండ్రు మట్టిని పూర్తిగా తొలగించారు. నడిపూడిలో కూడా గోదావరి పుష్కర రేవు, మండలంలోని పలు ఆలయాల పుష్కరిణులు శుభ్రం చేశారు.

అంబేడ్కర్ వర్సిటీకి భవనం చూపండి

- వారంలో తాత్కాలిక కార్యాలయం
- జనవరిలో విద్యార్థుల ప్రవేశానికి చర్యలు
- నేడు కలెక్టర్‌తో ఇన్‌చార్జి వీసీ సమావేశం

ఏలూరు అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సమీపంలో ఏర్పాటు కానున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీకి భవనం కేటాయింపుపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కరరావు బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వితో సమావేశం కానున్నారు. కలెక్టర్ అనుమతి లభించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. విశ్వవిద్యాలయాన్ని తొలుత ప్రభుత్వ భవనంలో ప్రారంభించేందుకు వీలుగా అందుబాటులో తగిన భవనాలు చూపాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి ఇప్పటికే లేఖ పంపారు. వారం రోజుల్లో యూనివర్సిటీ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించడానికి అధికారులు సమాయత్తం అయ్యారు. ఆఫీసు భవనం ఖరారైన వెంటనే ఇక్కడి నుంచే రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయ కార్యకలాపాలను నిర్వహించనున్నారు. కొత్తగా భవనాలను నిర్మించేందుకుకూడా ప్రభుత్వ భూములకోసం అభ్యర్థించారు. మరోవైపు డిగ్రీ, పీజీ కోర్సులకు వచ్చే జనవరి నుంచి ప్రవేశాలు చేపట్టాలని అధికారికంగా నిర్ణయించారు. రాష్ట్రంలో యూనివర్సిటీకి 72 రీజినల్ సెంటర్లలో పనిచేసే సిబ్బందికి గత 10 నెలలుగా జీతాలు చెల్లించకపోవడాన్ని గుర్తించిన అధికారులు తొలి ప్రాధామ్యాల్లో భాగంగా సిబ్బంది జీతాలబకాయిలను చెల్లించేందుకు నిర్ణయించారు.

సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో..?

తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకోసం గన్నవరం ఎయిర్‌పోర్టుకు సమీపంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులోవున్న విషయాన్ని యూనివర్సిటీ అధికారులు ఇప్పటికే గుర్తించగా, ఆ ప్రాంతం ఏలూరు జిల్లాకు చెందినది కాకపోవడంతో పునఃపరిశీలనలో ఉంచారు. ప్రస్తుతం జిల్లాకు సంబంధించి యూనివర్సిటీకి ఏలూరు సీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో రీజినల్ సెంటర్‌ను ఆధునీకరించి, అందులోనే తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారన్న ఓ ప్రచారం ఉంది. వట్లూరులో గతంలో ఏపీ నిట్ ఏర్పాటుకు ప్రతిపాదించి, విరమించుకున్న ప్రభుత్వ భూముల్లో విశ్వవిద్యాలయ భవనాలను నిర్మిస్తే జాతీయ రహదారికి చేరువగా ఉంటాయని, అలాగే గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాల ప్రాంగణానికిచేరువగావున్న 6.50 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూముల్లోకూడా యూనివర్సిటీ శాశ్వత భవనాలను నిర్మించడానికి నేషనల్ హైవే సమీపంలోనే ఉంటుందని మరికొన్ని ప్రతిపాదనలున్నాయి. ఈ అంశాలపై బుధవారం కలెక్టర్‌తో చర్చించనున్నారు.



స్కేటింగ్ రింక్‌లో ఉత్సాహంగా తలపడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా స్కేటింగ్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్స్ గేమ్స్ జూడో, స్కేటింగ్ ఎంపిక పోటీలు మంగళవారం ఏలూరు ఇండోర్ స్టేడియం వేదికగా జరిగాయి. ఇటీవల మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర పోటీలకు ఎంపిక కావాలనే లక్ష్యంతో క్రీడాకారులు తమ శక్తియుక్తులను ప్రదర్శించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ పద్మలత తెలిపారు. స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో అండర్ 14 నుంచి 17 విభాగాల విద్యార్థులకు స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారు. పీడీలు రవిబాబు, కృష్ణ వెంకటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు.

కొత్త అల్లుడికి అదిరిపోయే ఆతిథ్యం

వీరవాసరం (భీమవరం టౌన్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్త అల్లుడికి అదిరిపోయే ఆతిథ్యం ఇవ్వడంలో గోదావరి జిల్లా అత్తింటివారు ముందుంటారు. కొత్త అల్లుడికి ఈ మర్యాదలు ఎక్కువగా సంక్రాంతి పండగకు ప్రత్యేక విందు ఇస్తారు. ఇప్పుడు దీపావళికి కూడా విందులతో అదరగొడుతున్నారు. అల్లుడికి విందు అంటే ఒకటో, రెండో రకాలతో కాదు దాదాపు 200 రకాలతో విందు భోజనం పెట్టి అల్లుడికి దీపావళి స్పెషల్‌ను అందించారు. వీరవాసరం మండలం పంజా వేమవరం గ్రామానికి చెందిన మళ్లా తులసీ రాంబాబు కుమార్తె గోవర్ధినికి విశాఖపట్నంకు చెందిన రాహుల్‌తో ఈ నెల 11న వివిశాఖపట్నంలో వివాహం చేశారు. పెళ్లి అయిన 10 రోజులకే దీపావళి పండుగ రావడంతో రాహుల్ అత్తింటికి వచ్చారు. రాహుల్‌కు 200 రకాల నాన్‌వెజ్, వెజిటేరియన్ వంటకాలతో కమ్మనైన విందు భోజనం రుచి చూపించారు. అల్లుడికి స్వయంగా మామ రాంబాబు వడ్డించారు. దీంతో అల్లుడు అత్తింటివారి మర్యాదలకు, విందుకు ఫిదా అయిపోయిడు. ఇలాంటి మర్యాదను తాను ఎప్పుడూ చూడలేదంటూ మామ రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని అల్లుడు, కుతూరుని ఇంటికి తీసుకువచ్చామని, కొత్త అల్లుడిని సర్‌ప్రైజ్ చేయాలనే ఉద్దేశంతో 200 రకాలను దగ్గరుండి తయారు చేయించానని ఆనందంతో తెలిపారు.



అల్లుడికి పిండి వంటలు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు

పెంటపాడు విద్యార్థులు

3ఎఫ్ ఇండస్ట్రీస్ రూ.2 లక్షల ఆర్థిక ప్రోత్సాహం

పెంటపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికయ్యారు. కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న కాశిరెడ్డి కావ్య, ఎ.శివసత్య ఎన్‌సీసీ క్యాడెట్స్. కావ్య గత జనవరిలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొంది. రానున్న జనవరిలో జరిగే వేడుకలకు కూడా ఎంపికైంది. కళాశాల ప్రాంగణంలో కళశాల వ్యవస్థాపకుడు బాలకృష్ణ గోయెంకా విగ్రహ ప్రతిష్ఠకు వచ్చిన ఫుడ్‌ఫ్యాట్ సంస్థ ఎండీ ఓపి గోయెంకా, డైరెక్టర్లు సుశీల్, సీమాకు ప్రిన్సిపాల్ ఎన్.వెంకటేశ్వరరావు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు 3ఎఫ్ ఇండస్ట్రీస్, ఫౌండేషన్ తరపున విద్యార్థుల ఉన్నత చదువులకు రూ.లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకం ప్రకటించారు

భవిష్యత్‌లో పీజీ చేస్తా



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ తృతీయ సంవత్సరం చదువుతున్నాను. గత జనవరిలో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలలో సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొన్నాను. వచ్చే జనవరిలో జరిగే పరేడ్‌కు కూడా ఎంపికయ్యాను. 3ఎఫ్ ఇండస్ట్రీస్ వారు ఉన్నత చదువులకు ప్రోత్సాహం ప్రకటించడం ఆనందం కలిగించింది. భవిష్యత్‌లో పీజీ చేస్తాను.

- కాశిరెడ్డి కావ్య, బీఎస్సీ జువాలజీ, పెంటపాడు

ఆర్మీలో చేరడమే లక్ష్యం



నాకు డిఫెన్స్ అంటే చాలా ఇష్టం. ఆర్మీ లక్ష్యంగా ఎన్‌సీసీలో చేరాను. ఇటీవల కాకినాడలో జరిగిన ఇంటర్ గ్రూప్ పోటీల నుంచి ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకలకు ఎంపికయ్యాను. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ కోచ్ ప్రేమ్‌సాగర్ ఎంతో తోడ్పాటు అందించారు. త్రీ ఎఫ్ ఇండస్ట్రీస్ ప్రోత్సాహానికి కృతజ్ఞతలు.

- ఎ.శివసత్య, బీకాం, పిప్పర

వైద్యం వికటించి మహిళ మృతి

వైద్యుల నిర్లక్ష్యం కారణమని బంధువుల ధర్నా

నూజివీడు టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన బాలింత ప్రత్తిపాటి ఉషారాణి (28) మృతి చెందింది. ప్రసవం కోసం ఆదివారం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఉషారాణి చేరి పండంటి మగబిడ్డను ప్రసవించింది. కొద్దిసేపటికే పరిస్థితి విషమంగా మారడంతో వైద్య పరీక్షలు చేసిన నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యులు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని సూచించారు. రక్తం ఎక్కిస్తున్న క్రమంలో ఉషారాణి పరిస్థితి మరింత విషమించడంతో విజయవాడ జీజీహెచ్‌కు నూజివీడు వైద్యులు సోమవారం రిఫర్ చేశారు. విజయవాడకు తరలిస్తుండగా ఆమె మృతి చెందినట్లు జీజీహెచ్ వైద్యులు నిర్ధారించారు.



ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు (ఇన్‌సెట్) ఉషారాణి మృతదేహం

బంధువుల ధర్నా

నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఉషారాణి మృతి చెందిందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. రక్తం ఎక్కించిన తరువాతే ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైందని, ఆ సమయంలో వైద్యులు ఆమెను పట్టించుకోలేదని భర్త బాలయ్య, బంధువులు ఆరోపించారు. ఏరియా ఆసుపత్రి వద్ద ఉషారాణి బంధువులతో కలిసి సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తదితరులు ధర్నా చేపట్టారు. బాలింత మృతిపై సమగ్ర విచారణ జరిపి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో నూజివీడు ఏరియా ఆసుపత్రి వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ బాధిత కుటుంబసభ్యులతో చర్చించడంతో బాధితులు ఆందోళనను విరమించారు.

బిడ్డను చూడకుండానే..

మగబిడ్డ కావాలని ఆశపడిన బాలయ్య, ఉషారాణి దంపతులకు ఆశ నెరవేరింది. బిడ్డను కళ్లారా చూడకుండానే తల్లి మృతి చెందడంతో పోతురెడ్డిపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. పదేళ్ల క్రితం వారికి వివాహం కాగా వరుసగా ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. మగబిడ్డ కావాలనే ఆశతో ఉన్న దంపతులకు మరో రెండు కాన్పులు జరిగినా ఆ బిడ్డలు నిలువలేదు. చివరికి ఆదివారం ఉషారాణి పండంటి మగబిడ్డకు జన్మినిచ్చి తుదిశ్వాస విడిచింది. 'మరోవైపు తమ్ముడు పుట్టాడు కాని అమ్మను ఎందుకు బాక్స్‌లో పెట్టారు? అమ్మ ఎందుకు లేవడం లేదు? తమ్ముడు పుట్టగానే అమ్మ మాకు చూపిస్తానంది.. అమ్మను లేపండి' అంటూ ఉషారాణి కుమార్తెలు ఏరియా ఆసుపత్రిలో రోదిస్తున్న తీరు చూపరులను సైతం కన్నీరు పెట్టించింది.

కాగా ఉషారాణి దంపతులు మగపిల్లాడు కావాలనే కోరిక, వరుస ప్రసవాల నేపథ్యం, బాలింతకు రక్తంలో హిమోగ్లోబిన్ బాగా పడిపోయిందని వైద్యులు చెబుతున్నారు. రక్తం ఎక్కించే క్రమంలో సైడ్ ఎఫెక్ట్ రావడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఏరియా ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

23, 24 తేదీల్లో క్రీడా ఎంపికలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్జీఎఫ్ కార్యదర్శి అలివేలు మంగ మంగళవారం తెలిపారు. వాలీబాల్ క్రీడా ఎంపికలు ఈ నెల 23న కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియం, 24న ఫుట్‌బాల్ క్రీడా ఎంపికలు దేవరపల్లి జడ్పీ హైస్కూలులో జరుగుతాయని వివరించారు. క్రీడాకారులు తాము చదువుతున్న స్కూలు హెచ్ఎం లేదా ప్రిన్సిపాల్ సంతకం చేసిన జిల్లా స్థాయి ఎంట్రీఫాం అందజేయాలని సూచించారు. క్రీడాదుస్తులు, వాటర్ బాటిల్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 90308 94311లో సంప్రదించాలని కోరారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఒకరి మృతి

టి.నరసాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మోటర్ సైకిల్ ఢీకొని ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఏపిగుంట పంచాయతీ లింగమ్మగూడెం గ్రామానికి చెందిన కుంజా సోమరాజు (49) టి.నరసాపురం గ్రామానికి చెందిన అలగాని వెంకటేశ్వరరావుకు కొబ్బరికాయలు కోయడానికి వెళుతున్నాడు. మంగళవారం ఉదయం మోటార్ సైకిల్‌పై వెళుతుండగా గుర్వాయిగూడెం శివారు మలుపు వద్ద మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పాకా బలరామ్ మోటార్‌సైకిల్‌పై అతివేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సోమరాజు తలపై తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి తలకు బలమైన దెబ్బతగలడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య కుంజా దుర్గ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

లారీని వెనక నుంచి ఢీకొన్న మరో లారీ

డ్రైవర్ మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు పెట్టకుండా లారీని నిలిపి ఉంచడంతో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీకొన్న లారీ డ్రైవర్ మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా నాతవరం మండలం లింగపల్లి గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ సుర్లరాజు (36) లోడుతో హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఒక లారీ ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ దుగ్గిరాల వద్ద ఆగి ఉంది. ఆ లారీ ముందు వెళుతుందని భావించిన రాజు నడుపుతున్న లారీ వెనక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రాజును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.



ఏలూరులో బాణసంచా కాలుస్తున్న యువతులు

దుగ్గిరాలలో బాణసంచా కాలుస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



భూగర్భ జలాల స్థాయిని పెంచాలి : కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భ జలాల స్థాయిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ పునర్ నిర్మాణం పనులపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. జిల్లాలో 1,513 మైనర్ ఇరిగేషన్ చెరువులకు గాను మొదటి విడదలో 175 చెరువుల అభివృద్ధిని చేపట్టేందుకు, 100 సాగు, తాగునీటి చెరువులను పూడికలను తీయడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రతీవారం లక్ష్యాలను నిర్ధేశించుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు.

'చింతలపూడి' అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే రోషన్



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కామవరపుకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే లక్ష్యమని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ప్రతీ అధికారి, ఉద్యోగి అంకిత భావంతో పనిచేస్తూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆటో డ్రైవర్ల సేవల పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లందరికీ నగదు అందించామని, ఇంకా అర్హులుంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయంలో నలుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను అందజేశారు.

పదోన్నతులు కల్పించాలని 'జేసీ'కి వినతి



జేసీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా గ్రేడ్-2 వీఆర్వోల సంఘం నాయకులు ఇటీవల జేసీగా బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. గ్రేడ్-2 రాష్ట్ర అధ్యక్షులు నంబూరి జోషి, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల అధ్యక్షకార్యదర్శులు ఎస్‌కే అక్బర్, జాన్, సూర్యకుమారి, శ్రీనివాస్, సత్యనారాయణ, శివలక్ష్మీ, వినయ్, బుజిం గరావు, శివ, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, శేషు, పోసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 25మంది లింగపాలెం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లింగపాలెం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్ పోటీలకు లింగపాలెం మండలంలోని శింగగూడెం, కలరాయనగూడెం, రంగాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 25మంది విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.అలివేలు మంగ తెలిపారు. నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను పాఠశాలల హెచ్‌ఎంలు బి.శ్రీధర్, కె.శ్రీనివాసరావు, బి.వెంకట రత్నం, వ్యాయా మోపాధ్యాయులు పద్మావతి, ప్రకాష్‌రెడ్డి, కామేశ్వరరావు అభినందించారు.

దూబచర్ల-లక్కవరం ప్రధాన రోడ్డుకు మరమ్మతులు



జి.కొత్తపల్లిలో రోడ్డుకు మరమ్మతులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జి. కొత్తపల్లిలో దూబచర్ల నుంచి లక్కవరం ప్రధాన రహదారికి దాదాపు రూ.40లక్షలతో తాత్కాలిక మరమ్మతులు వేగవంతంగా జరుగుతున్నాయి. జి.కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో సర్పంచ్ కస్సే శ్రీహరి మరమ్మతులు చేయించారు. ఈక్రమంలో ఈ రోడ్డును శాశ్వత రోడ్డు పనులకు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు రూ.4 కోట్లు నిధులు మంజూరు చేయించారని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని సొసైటీ చైర్మన్ రేగంటి రాంబాబు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ పి.ధర్మరాజు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కుంతలగూడెం పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో కనకాద్రిపురం గ్రామస్థులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఇతర అధికారులు రెండు గ్రామాల ముఖ్య నాయకులతో మరోమారు చర్చలు జరిపారు. రెండు గ్రామాల ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. మరోవైపు త్వరితగతిన భవన నిర్మాణ చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కరువు భత్యం జీవోలపై ఉద్యోగుల కన్నెర్ర!

(5వ పేజీ తరువాయి)

చెల్లింపు విషయంలో గందరగోళానికి గురిచేయడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను మోసం చేయడమేనని సంఘాలు విమర్శిస్తున్నాయి.

జీవోలు 60, 61లను సవరించాలి



ప్రభుత్వం డీఏ బకాయిల చెల్లింపు విషయంలో దాటవేత ధోరణిని ప్రదర్శిస్తోంది. 21 నెలల బకాయిలు రిటైర్‌మెంట్ నాడు చెల్లిస్తామని జీవోలో పేర్కొనడం దారుణం. 20 ఏళ్ల తర్వాత రిటైరయ్యే ఉద్యోగికి ఈ బకాయిల సొమ్ముకు వడ్డీ గాని, అవసరాలకు డబ్బును వాడుకొనే అవకాశం ఉండదు. తక్షణం సవరించాలి.

- వి.రవికుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



రిటైర్‌మెంట్‌తో ఇస్తామనడం సరికాదు

డీఏ బకాయిలు చెల్లింపుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అనుసరించిన తీరు బాధాకరం. 21 నెలల డీఏ బకాయిలు రిటైర్‌మెంట్‌తోపాటు ఇస్తామనడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదు. సీపీఎస్ వారి ప్రస్తావన తేకపోవడం దారుణం.

- షేక్ రంగావళి, రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం.

సవరణకు డిమాండ్

డీఏ బకాయిలను రిటైరైన తర్వాత చెల్లిస్తామని షరతు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికే ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు 2027-28 ఆర్థిక సంవత్సరంలో బకాయిలను 12 విడతల్లో చెల్లిస్తామని మెలిక పెట్టడాన్ని ఖండిస్తున్నట్టు ఏపీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు తెలిపారు.

● కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి నాలుగు విడతల డీఏల చెల్లింపు గురించి ఎదురుచూస్తున్న సమయంలో ఒకేఒక్క డీఏను దీపావళి సందర్భంగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించి, అదికూడా ఎరియర్స్ చెల్లింపు విషయంలో ఉద్యోగి రిటైరైన తర్వాత లేదా మరణించిన తర్వాత చెల్లిస్తామనడం విడ్డూరంగా ఉందని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఆక్షేపించారు.

●ప్రస్తుత అవసరాలకు ఇవ్వాల్సిన డీఏను రిటైర్మెంట్ తర్వాత లేదా మరణానంతరం ఇస్తామనడం అన్యాయ మని ఏపీటీఎఫ్-1938 నాయకులు జి.కృష్ణ, రామ్మోహన్, మోహన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులకువున్న నమ్మకాన్ని వమ్ముచేస్తూ నాలుగు డీఏలకు కేవలం ఒక డీఏను ప్రకటించి నిరాశకు గురిచేశారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డి దొర ఆరోపించారు.

●సంప్రదాయానికి విరుద్ధంగా ఉన్న కరువు భత్యం జీవోలు 60, 61 వెంటనే సవరించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

●డీఏలకు సంబంధించి విడుదల చేసిన 60, 61 జీవోలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఇచ్చారా ? లేదా ? అధికారులు స్పష్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రెండు జీవోల విడుదలపై సవరణ చేయాలని వారు డిమాండ్ చేశారు.



ద్వారకాతిరుమలలో శ్రీవారు,అమ్మవార్ల ముందు టపాసులు కాల్చుతున్న సిబ్బంది.



దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చుతున్న ఎమ్మెల్యే బడేటి చంటి దంపతులు



దీపావళి సంబరాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్ కుటుంబ సభ్యులు

ఉత్సాహంగా దీపావళి సంబరాలు

ఏలూరు రూరల్/ఏలూరుటూటౌన్/పెదపాడు/పెదవేగి/లింగపాలెం/చింతలపూడి/పోలవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దీపావళి సంబరాలు ఉత్సాహంగా సోమవారం సాగాయి. మహిళలు లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి బాణసంచా కాల్చారు. ఆకాశంలో బాణసంచా వెలుగులు మిరిమిట్లు గొలిపాయి. గ్రామాల్లో మహిళలు ఇళ్ల ముందు దివ్వెలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటి కుటుంబసభ్యులు బాణసంచాలు కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మేయర్ కార్యాలయంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్ దీపావళి వేడుకలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చారు. పెదపాడు, పెదవేగి మండలాల్లోని గ్రామాల్లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీవర్షంతో దుకాణాదారులు కొంత ఆందోళన చెందినప్పటికీ సాయంత్రానికి బాణసంచా దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. లింగపాలెం మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు దీపావళి వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. చింతలపూడి మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. పాతబస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బాణసంచా కాల్చి కార్యకర్తలతో ఆనందాన్ని పంచుకున్నారు. పోలవరం మండలంలో ఉత్సాహంగా బాణసంచా కాల్చి పండుగను జరుపుకున్నారు.

శ్రీవారి సన్నిధిలో వెలుగుల దీపావళి

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయంలో కోవెల ఉత్సవంగా జరిపి వేడుకగా టపాసులు కాల్చారు. శ్రీవారికి మిగులు తిథిలో మంగళవారం దీపావళి ఉత్సవాన్ని ఆలయంలో నిర్వహించారు. తొళక్క వాహనంపై ఉభయదేవేరులతో కొలువైన శ్రీవారికి కోవెల ఉత్సవాన్ని వేడుకగా జరిపారు. ముందుగా ఆలయంలో దీపాలు వెలిగించారు.

కూటమి ప్రభుత్వంతో మొదలైన సంక్షేమం

» ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో సంక్షేమం మొదలైందని, నరకాసుర వధతో ప్రజలు ఎలాగైతే పండుగ చేసుకున్నారో ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి పొందిన ప్రజలు దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దీపావళిని పురస్కరించుకుని పెదవేగి మండలం దుగ్గిరాలలో సోమవారం ఎమ్మెల్యే ప్రభాకర్.. ప్రజాపతినిధులు, పార్టీ నాయకులతో కలిసి దీపావళి పండుగను జరుపుకున్నారు. పలువురు ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందించారు.



ఎస్ఐ మధు వెంకటరాజు ఇంటికి వెళ్లి బాణసంచా అందిస్తున్న ఎస్పీ కిశోర్

ఎస్ఐ కుటుంబానికి ఎస్పీ శుభాకాంక్షలు

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒక కేసు దర్యాప్తు నిమిత్తం ఏలూరు టూటౌన్ ఎస్ఐ మధు వెంకటరాజు ఇతర రాష్ట్రాలకు వెళ్లి అక్కడే ఉన్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు సంతోషంగా జరుపుకోవడానికి ఎస్పీ కిశోర్ స్వయంగా ఆ కుటుంబం వద్దకు వెళ్లి బాణసంచా సామగ్రి, స్వీట్స్‌ను బహుమతిగా అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ వెళ్లి శుభాకాంక్షలు చెప్పడంతో వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

● దీపావళి పండుగ రోజున ఏలూరు ఇండోర్ స్టేడియంలోని దీపావళి సామగ్రి షాపులను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్పీ వెళ్తుండగా ఒక హెడ్‌కానిస్టేబుల్ హెల్మెట్ ధరించి బైక్‌పై వెళ్తుండడాన్ని గమనించి ఆ హెచ్‌సీని ఆపి అభినందించి స్వీట్ బాక్సును అందించారు.

'నేడు ఐటీడీఏ ముట్టడి'ని జయప్రదం చేయండి

బుట్టాయగూడెం/వేలేరుపాడు/కుక్కునూరు/ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి):గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో జరుగుతున్న చలో ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డివిజన్, మండల నాయకులు కారం దారయ్య, చోడెం దుర్గ పిలుపునిచ్చారు. ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ హాజరవుతారన్నారు. ఐటీడీఏ ధర్నాను జయప్రదం చేయాలని వేలేరుపాడులో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ.ముస్నీర్ పిలుపునిచ్చారు. కుక్కునూరులో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కొన్నే లక్ష్మయ్య, ఐతా సురేశ్, ఎం.వెంకటాచారి, ఎం.రమ ణయ్య, బాబూరావు, వి.శ్యామల పాల్గొన్నారు. ఏలూరు సీపీఐ కార్యాల యంలో సీపీఐ నాయకులు మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాసడాంగే, పి.కిషోర్, శ్యాంసుందర్ తదితరులు ఏజెన్సీ సమస్యలపై నిర్వహిస్తున్న పోరాటానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

బావాయిపాలెం పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

నిడమర్రు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):పాఠశాల అభివృద్ధికి దాతలు సాయం అభినందనీయమని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేవీఎస్ మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం బావాయిపాలెం ఉన్నత పాఠశా లలో పాఠశాల పూర్వవిద్యార్థి బీజేపీ నిడమర్రు మండల అధ్యక్షుడు ఆకుల ప్రవీణ్‌కుమార్ రూ.పది వేల విలువైన హెచ్‌ఎం టేబుల్, చైర్, 12 కుర్చీలు బహూకరించారు. ఆయనకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

పోలవరం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : పోలవరం బస్ షెల్టర్‌లో సోమవారం ఒక గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. కొన్ని రోజులుగా పోల వరంలో భిక్షాటన చేసుకుంటూ తిరుగుతున్న వృద్ధుడు రెండు రోజులుగా బస్‌షెల్టర్‌లో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడని మృత దేహాన్ని పోలవరం సీహెచ్‌సీకి తరలించి, పంచాయతీ సిబ్బందితో ఖననం చేయించినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

ఏలూరు క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు సమీపంలో గవర్నమెంట్ ఐటీఐ కాలేజీ దగ్గరలో ఉన్న రైలు పట్టాలపై ఒక గుర్తు తెలియని వ్యక్తి రెండు ముక్కలై మృతి చెంది ఉన్నాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే పోలీసులకు అందడంతో రైల్వే హెచ్‌సీ పి.శ్రీనివాస్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీంచారు. మృతుడు 5.5 అడుగుల ఎత్తు కల్గి, ఛామన ఛాయ శరీరంతో ఉన్నాడు. సుమారు 45 ఏళ్ల వయస్సు కల్గి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 97047 98990 నంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

దళిత బాలుడిపై దాడి ఘటనలో నలుగురిపై అట్రాసిటీ కేసు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : వేగవరం గ్రామంలో దళితుడిపై దాడిచేసిన ఘటనపై నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశామని డీఎస్పీ యు. రవిచంద్ర తెలిపారు. వివరాలివి.. ఈనెల ఐదో తేదీన దసరా ఊరేగింపును చూసేందుకు వచ్చిన దళిత బాలుడిని కులం పేరుతో దూషించి, కొట్టిన ఘటనలో బాధిత బాలుడి తండ్రి బేతాళ గంగాధరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బాలుడిపై దాడికి పాల్పడిన నులకాని రామ్‌చంద్, సారేపల్లి ధర్మరాజు, కోటపోతుల పవన్, వనముల సాయిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బీఎన్‌ఎస్ చట్టాల ప్రకారం కేసు నమోదు చేశామని తెలిపారు. బాలుడు నాగ చైతన్య ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి బాధితుడికి గాయం ఎలా అయింది అనే వాస్తవాలను బయటకు తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అక్రమ మద్యం ఉన్న వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేశామని చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ సీఐ అశోక్ తెలిపారు. టినరసాపురం పంచాయతీలోని మెట్టగూడెం గ్రామంలో బెల్టుషాపుల నిర్వాహకులపై దాడులు నిర్వహించి బైగాని సూర్యనారాయణ వద్ద 180 ఎంఎల్ పరిమాణం కలిగిన ఐదు డ్యూటీ పేయిడ్ లిక్కర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలు అబ్దుల్‌కలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

పెదపాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తన కుమారుడు నల్లపరాజు సత్యనారాయణరాజు ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి కన్పించడం లేదని తండ్రి నల్లపరాజు రామరాజు పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాళ్ల మండలం, కలవపూడికి చెందిన సత్యనారాయణరాజు (40) పెదపాడులో ఉంటూ వీరమ్మకుంట, నాయుడుగూడెం గ్రామాల్లో చేపల చెరువులు చేస్తూ, పెదపాడు సబ్‌స్టేషన్‌లో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడన్నారు. చెరువుల్లో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని, ఇంకా వివాహం కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ గజపతిరావు తెలిపారు.



చింతలపూడిలో అమరవీరుల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

పోలీసుల త్యాగం మరువలేనిది

» ఎమ్మెల్యే రోషన్‌కుమార్ » జిల్లావ్యాప్తంగా పోలీసు అమర వీరుల దినోత్సవం

చింతలపూడి/దెందులూరు/పోలవరం/లింగపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసుల త్యాగం మరువలేనిదని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన పోలీసు అమరవీరుల దినోత్సవం ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ క్రాంతికుమార్ అమరవీరుల దినోత్సవాన్ని వివరించారు. చింతలపూడి, ధర్మాజీగూడెం ఎస్ఐలు సతీష్‌కుమార్, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు. దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆర్.శివాజీ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. హమీద్, సిబ్బంది పాల్గొన్నారు. పోలవరం పోలీస్‌స్టేషన్‌లోఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. అమరవీరులకు నివాళిగా మౌనం పాటించారు. స్టేషన్ రైటర్ భీమశేఖర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని, విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను మరిచిపోకూడదన్నారు. తొలుత పోలీస్‌స్టేషన్ ఆవరణలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

'స్వాములకు భిక్ష.. పుణ్యఫలాలను అందిస్తుంది'



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న రాజు

కామవరపుకోట, అక్టోబరు 21 (ఆంధ్ర జ్యోతి) : స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం పుణ్యఫలాలను అందజేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఆర్ఆర్ లక్ష్మీసూర్యనారాయణరాజు అన్నారు. మంగళవారం కామవరపు కోట వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాముల భిక్ష కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గత తొమ్మిదేళ్లుగా నిర్విఘ్నంగా మాలాధారణ చేసిన వారికి భిక్ష ఏర్పాటు చేయడంతో మండలంలో మాల వేసుకునే భక్తుల సంఖ్య పెరుగుతుందని అన్నారు.

టెన్త్ పరీక్షల సన్నద్ధతపై నేడు సమావేశం

ఏలూరు అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేసేందుకు బుధవారం ఏలూరు సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవోలు, డీవైఈవోలు హాజరవ్వాలని జిల్లావిద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గత విద్యాసంవత్సరం (2024-25)లో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ఏలూరు జిల్లా దారుణమైన ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. తాజాగా వచ్చే ఏడాది జరిగే టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణతను సాధించేందుకు ఇప్పటి నుంచే విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పదో తరగతి సబ్జెక్టులు బోధించే టీచర్లు రోజుకొకరు చొప్పున తమ సబ్జెక్టుకు సంబంధించి ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. పరీక్షలు ప్రారంభమ య్యే వరకు హైస్కూళ్లలో బోధనపై పర్యవేక్షించేందుకు జిల్లా, మండలస్థాయి బృందాలను నియమిస్తున్నారు. వీటితోపాటు మరికొన్ని చర్యలను బుధవారం నాటి సమావేశంలో ప్రకటించనున్నారు.

ఘనంగా పునీత పాడ్రే పియో దేవాలయ ప్రతిష్ఠ



ప్రార్థన చేస్తున్న పీఠాధిపతి పొలిమేర జయరాం

ఏలూరు రూరల్, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రూరల్ మండలం జాలిపూడి విచారణ కాట్లంపూడిలో పునీత పాడ్రే పియో దేవాలయ ప్రతిష్ఠ మంగళవారం ఘనంగా జరిగింది. ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమేర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుని యందు భయభక్తులు కలిగి దేవుని ఆజ్ఞలు కనుగుణంగా ప్రేమ, సేవాగుణాలతో జీవించాలన్నారు. ఫాదర్ అంతోని రాజు మాట్లాడారు, తొలుత సమష్టి పూజ అర్పించారు. శృంగవృక్షం ఫాదర్ తోట గాబ్రియేలు సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజ్ కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్ ఏలూరు కేథడ్రల్ చర్చి ఫాదర్ మైకేల్, ఫాదర్ అమ్మనరాజా, బాబు జార్జ్, మిల్కీయార్ రాజు, సంఘస్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాధిత విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థికి బ్రెయిన్ ట్యూమర్ అనే ప్రాణాంతక వ్యాధి వచ్చిందని అందుకు రూ.ఎనిమిది లక్షల వరకు ఖర్చవుతుందని, పేదవాడ కావడంతో ఉపాధ్యాయులు స్పందించి రూ.55 వేలు సేకరించి విద్యార్థి తల్లిదండ్రులకు మంగళవారం అందించారు. స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న కోన ఆదిత్య కొద్ది రోజుల క్రితం పాఠశాలకు బయలుదేరి ఇంటివద్ద కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్చగా బ్రెయిన్ ట్యూమర్ అని తెలిసింది. ఆపరేషన్ నిమిత్తం ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే బాలుడి తండ్రి కోన నాగవెంకట సురేష్ హెచ్‌ఎం సోమశేఖర్‌ను సంప్రదించగా తోటి ఉపాధ్యాయుల సహకారంతో నగదు సేకరించి అందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ

4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు పటిష్ఠ ప్రణాళిక : జేసీ

పెదపాడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవడంతో పాటుగా 4.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు పటిష్ఠ ప్రణాళిక అమలు చేయనున్నట్టు ఎం.జె.అభిషేక్‌గౌడ తెలిపారు. వట్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సత్యకృష్ణ మోడ్రన్ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లును ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతుల ఇబ్బందులు, సమస్యలను తెలుసుకునేందుకు 77020 03584, 18004 256453 నెంబర్లతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. కాగా పునుకొల్లులో జరుగుతున్న రీ సర్వే పనులను జేసీ మంగళవారం పరిశీలించారు. జిల్లాలో అక్టోబరు 3 నుంచి మూడో విడత రీ సర్వే పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆళ్ల సతీష్ చౌదరి, డీఎస్‌వో విలియమ్స్, సివిల్ సప్లై జిల్లా మేనేజరు పి.శివరామ మూర్తి, జేడీ షేక్ హబీబ్ బాషా, డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోతునూరులో అయ్యప్ప మాలధారులకు భిక్ష

దెందులూరు,అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దాత, మాజీ ఎంపీటీసీ. పార్టీ మండల ఉపాధ్య క్షుడు తలారి ధన్యకుమార్-భారతి దంపతులు ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో అయ్యప్ప మాలదీక్షధారులు భిక్షను స్వీకరించారు. శ్రీగౌరీ శంకర కమ్యూనిటీ హాలులో అయ్యప్ప స్వాములకు రోజుకు ఒకరు చొప్పున దాతలు ముందుకు వచ్చి అన్నదానం, స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని బ్యాంక్ అధ్యక్షుడు మోహన్‌బాబు ఆర్గనైజింగ్ నిర్వహిస్తారు. టీడీపీ నాయకులు, తలారి ధన్యకుమార్ భారతి దంపతులు స్వాములకు 16 రకాల పిండివంటలు, అల్పాహారం, అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. గురుస్వాములు గంగరాజు గురుస్వామి, పరిటాల కొండస్వామి, దుర్గాప్రసాద్, భీళ్ల వీర్రాజు, బుద్ధా సాంబశివరావు, నున్న లక్ష్మణ్, స్వాములు పాల్గొన్నారు.

మహిళకు పాము కాటు

పోలవరం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో మహిళ అస్వస్థతకు గురైన ఘటన కమ్మరగూడెంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన మేదే మేరీ అనే మహిళ ఇంటి వద్ద పనులు చేసుకుంటున్న క్రమంలో పాము కాటు వేసింది. స్థానికులు ఆమెను ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని 24 గంటలు పర్యవేక్షణలో ఉంచినట్లు వైద్యులు తెలిపారు.

రెండు లారీలు ఢీ

జీలుగుమిల్లి, అక్టోబరు 21:లక్ష్మీపురం జాతీయ రహదారిపై గ్రామంలో రోడ్డు మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు మంగళవారం సాయంత్రం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ లారీలో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో స్థానికులు అప్రమత్తమై అతడిని బయటకు లాగారు. కాలు విరగడంతో వైద్యం కోసం జంగారెడ్డిగూడెం తరలించారు. గ్రామంలోని మలుపు ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, లారీ డ్రైవర్లు చెబుతున్నారు. రహదారి వద్ద మలుపునకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తే ప్రమాదాలు జరక్కుండా ఉంటాయని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు.

కాలువ పనుల అడ్డగింత..

మండవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం పెరికేగూడెం బ్రాంచ్ కాలువ పూడికతీత పనులను గ్రామస్థులు అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. కాలువ గట్టు వరకు స్థానికులు ఆక్రమించుకున్నారు. కాలువను తవ్వి మట్టి వేయవద్దని సమీప గృహాల వారు ఆందోళన చేశారు. దీంతో నీటి సంఘం అధ్యక్షుడు కూనపురెడ్డి కోటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు స్థానికులకు సర్దిచెప్పారు. కాలువ పనులు చేయకుంటే నీరు కిందికి పారేదెలా అని వివరించారు. అనంతరం పోలీసుల సమక్షంలో పనులను చేపట్టారు.

ఆంధ్రజ్యోతి నూజివీడు
కైకలూరు, నూజివీడు

ఉద్యోగుల డీఏ జీవో సవరించాలి

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగుల డీఏ జీవో నెం. 60 సవరించాలని యూటీఎఫ్ మండల కార్యదర్శి గంపా వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొత్తం 4 డీఏలు బకాయి ఉండగా ఒక్క డీఏ మాత్రమే ఇచ్చిందని, జనవరి 2024 నుంచి సెప్టెంబరు 2025 వరకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను సదరు ఉద్యోగి పదవీ విరమణ సమయంలో చెల్లిస్తామని, చనిపోయిన ఉద్యోగికి అయితే వారసులకు ఇస్తామనటం దారుణమన్నారు. ఈ ఉత్తర్వులను ఉపసంహరించాలని కోరారు.

పోలీసు అమర వీరుల దినోత్సవం



కర్రి మనోజ్ కుమార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ, పోలీసు బృందం

కలిదిండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మూల్లంకలో కైకలూరు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బృందం అమరవీరుడు గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కర్రి మనోజ్ కుమార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత కలిదిండిలో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కలిదిండి, మండవల్లి, కైకలూరు రూరల్, ముదినేపల్లి ఎస్ఐలు వి.వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, రాంబాబు, వీరభద్రరావు, పోలీసు సిబ్బంది, మూల్లంక సర్పంచ్ మహాదేవ విజయ్, అమరవీరుడు కర్రి మనోజ్ కుమార్ తల్లిదండ్రులు కర్రి సత్యనారాయణ, అప్పాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

షట్టర్ల మరమ్మతులకు చర్యలు



పాడైన షట్టర్‌ను పరిశీలిస్తున్న ఈఈ

కలిదిండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న షట్టర్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్ అన్నారు. మంగళవారం గుర్వాయిపాలెం వద్ద శిథిలావస్థలో ఉన్న షట్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోరుకొల్లు డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ మాట్లాడుతూ గుర్వాయిపాలెం, కొండంగి కాల్వల వద్ద షట్టర్లు పూర్తిగా పాడైపోవటంతో సాగు, తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సీబీ కెనాల్ నీటి మట్టం పెరగటంతో గట్లు బలహీనంగా ఉన్న ప్రదేశంలో గండ్లు పడే అవకాశం ఉందని, గట్లను పటిష్ఠం చేయాలని ఇరిగేషన్ అధికారులకు వివరించారు. అందుకు స్పందించిన ఈఈ చర్యలు తీసుకుంటామని, పెదలంక తాగునీటి చెరువు వద్ద కాల్వపై డ్యామ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కలిదిండి డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఇరిగేషన్ డీఈఈ శిరీష, ఏఈఈ ఫణి కుమార్ పాల్గొన్నారు.

పంట కాల్వలో వ్యర్థాలను నివారించాలి



పంట కాల్వలో చెత్తతొలగింపు పనులు పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వాసురాజు

కైకలూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంట కాలువలో వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం బారిన పడతారని, అందువల్ల ప్రజలు అవగాహనతో సహకరించాలని డీసీ చైర్మన్ పొత్తూరి వాసు రాజు అన్నారు. మంగళవారం కైకలూరు టౌన్లో పంటకాలువలోని చెత్త తొలగింపు పనులను ఆయన జలవనరులశాఖ అధికారులతో కలసి పరిశీలించి మాట్లాడుతూ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో కాలువల అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ప్రజలు నివాస గృహాల్లోని చెత్తను పంటకాలువల్లో వేయడం వల్ల నీరు కలుషితం అవుతుందన్నారు. కాలువకు ఇరువైపులా చెట్లను, కాలువల్లో గుర్రపుడెక్క, తూడు, నాచును తొలగిస్తున్నామన్నారు. ఈ పనుల వల్ల శివారు గ్రామాలకు నీటిని పూర్తిస్థాయిలో అందించగలుగుతామని ప్రజలకు తాగునీటికి, రైతులకు ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. టీడీపీ నాయకులు ముదునూరి కొండరాజు, అధికారులు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కలిదిండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పంచాయతీ పరిధిలో ఇందిరా కాలనీ 14వ వార్డులో ప్రాథమిక పాఠశాల వద్ద రహదారిపై మురుగు నీరు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారికిరువైపులా డ్రెయినేజీ పూడుకుపోవటంతో వర్షపు నీటితోపాటు మురుగునీరు రోజుల తరబడి రహదారిపై నిల్వ ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు డ్రెయినేజీల్లో పూడిక తీయించటంతోపాటు రహదారిని ఎత్తు చేయాలని కోరుతున్నారు.

కార్యకర్త కుటుంబానికి ముద్దరబోయిన పరామర్శ

ఆర్థిక సాయం అందించిన యువత నాయకుడు బాబి

ముసునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముసునూరు బీసీ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త మానికల నాగేంద్రరావు (42) ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే సర్పంచ్ తనయుడు, నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి) స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి, రూ. 5 వేలు నగదును అందజేశారు. ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, నాయకులు తలకొండ సాంబశివరావు, మానికల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బారికేడ్ల ఏర్పాటు పరిశీలిస్తున్న ఈవో..




స్వామివారు

బలివేలో కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు

ముసునూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో సీతారామయ్య తెలిపారు. తమ్మిలేరులో వరదనీటి ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో భక్తులు పుణ్యస్నానాలు చేసేటప్పుడు అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఘాట్‌ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. నిత్యం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి అరుణ భాస్కరరావు ఆధ్వర్యంలో పూజలు జరుగుతాయని, భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అర్చనలు చేయించుకునేలా, దర్శనానికి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే నెల 5న కార్తీక పౌర్ణమినాడు ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. భక్తులకు అసౌకర్యం లేకుండా ఆలయ చైర్మన్ శ్యామలరావు, కమిటీ సభ్యులు, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

వైద్యం వికటించి బాలింత మృతి

- మగబిడ్డ కోసం పరితపించి బిడ్డపుట్టాక చూడకుండానే కన్నుమూత...
- వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ధర్నా
- పోతురెడ్డిపల్లిలో విషాద ఛాయలు



ఉషారాణి మృతదేహం.. తల్లి కోసం చిన్నారుల ఎదురుచూపు



నూజివీడు టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్యం వికటించి నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన బాలింత ప్రత్తిపాటి ఉషారాణి (28) మృతి చెందింది. ప్రసవం కోసం ఆదివారం నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ఉషారాణి చేరి పండంటి మగబిడ్డను ప్రసవించింది. అయితే కొద్ది సేపటికే పరిస్థితి విషమంగా మారడంతో వైద్య పరీక్షలు చేసిన నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యులు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించాలని సూచించారు. ఆమెకు సరిపడా రక్తం తీసుకు రాగా రక్తం ఎక్కిస్తున్న క్రమంలో ఉషారాణి పరిస్థితి మరింత విషమించడంతో విజయవాడ జీజీహెచ్‌కు నూజివీడు వైద్యులు సోమవారం రిఫర్ చేశారు. అయితే విజయవాడకు తరలిస్తున్న క్రమంలో ఆమె మృతి చెందినట్లు జీజీహెచ్ వైద్యులు నిర్ధారించారు.

బంధువుల ధర్నా

నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఉషారాణి మృతి చెందిందని, మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉషారాణికి రక్తం సరిపోవడం లేదని, రక్తం ఎక్కించిన తరువాతే ఆమె తీవ్ర అనారోగ్యానికి గురైందని ఆ సమయంలో కనీసం వైద్యులు ఆమెను పట్టించుకోలేదంటూ ఉషారాణి భర్త బాలయ్య, బంధువులు ఆరోపిస్తూ నూజివీడు ఏరియా ఆసుపత్రి వద్ద బంధువులతో కలసి సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తదితరులు ధర్నాకు దిగారు. బాలింత మృతిపై సమగ్ర విచారణ జరిపి కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో నూజివీడు ఏరియా ఆసుపత్రి వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ ఉషారాణి కుటుంబ సభ్యులతో చర్చించడంతో వారు ఆందోళన విరమించారు.

బిడ్డను చూడకుండానే...

తమకు మగబిడ్డ కావాలని ఎంతో ఆశతో ఉన్న ప్రత్తిపాటి బాలయ్య, ఉషారాణి దంపతుల ఆశ నెరవేరింది. అయితే బిడ్డను కళ్లారా చూడకుండానే ఉషారాణి మృతి చెందటంతో నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి. దాదాపు పదేళ్ల క్రితం వీరికి వివాహం కాగా వరుసగా ముగ్గురు ఆడపిల్లలు జన్మించారు. అయితే మగబిడ్డ కావాలనే ఆశతో ఉన్న దంపతులకు మరో రెండు కాన్పులు జరిగినా ఆ బిడ్డలు నిలువలేదు. చివరికి ఆదివారం ఉషారాణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినా బిడ్డను కళ్లారా చూడకుండానే ఆమె తుదిశ్వాస విడిచింది. 'మరోవైపు తమ్ముడు పుట్టాడు కానీ అమ్మను ఎందుకు బాక్స్‌లో పెట్టారు? అమ్మ ఎందుకు లెగటం లేదు? తమ్ముడు పుట్టగానే తమను పిలిచి అమ్మ మాకు చూపిస్తానందిగా అమ్మను లేపండి' అంటూ ఉషారాణి కుమార్తెలు ఏరియా ఆసుపత్రిలో రోదిస్తున్న తీరు చూపరులను సైతం కన్నీరు పెట్టించింది.

సైడ్ ఎఫెక్ట్స్ వల్లే మృతి : వైద్యులు

కాగా ఉషారాణి దంపతులు మగపిల్లాడు కావాలనే కోరికతో వరుస ప్రసవాల నేపథ్యం, బాలింతకు రక్తంలో హిమోగ్లోబిన్ ఐదుకు పడిపోవడం, రక్తం ఎక్కించే పరిస్థితి రావడం, రక్తం ఎక్కించే క్రమంలో సైడ్ ఎఫెక్ట్స్ రావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఏరియా ఆసుపత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

ట్రిపుల్ ఐటీలో దీపోత్సవ్



నూజివీడు టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో దీపోత్సవ్ 2కె25 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం కార్యక్రమాన్ని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్, ఏవో బి. లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దీపోత్సవ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా, వాటిని డైరెక్టర్ అమరేంద్రకుమార్ ఆసక్తిగా తిలకించారు. అనంతరం క్యాంప్‌ఫైర్, విద్యార్థులు బాణసంచా ప్రదర్శనలు ఆహ్లాదభరితంగా సాగాయి.



విగ్రహాల వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

విగ్రహాలు తొలగిస్తే ఊరుకోం

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహాలు తొలగించి, అక్కడ బొడ్డురాయి ఏర్పాటు చెయ్యాలని ఒక వర్గం ప్రతిపాదించగా, మరో వర్గం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చెయ్యటంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలవరం మూడు రోడ్ల సెంటర్‌లో సుమారు 75 ఏళ్ళ క్రితం మహాత్మా గాంధీ విగ్రహాన్ని, సుమారు 40 ఏళ్ళ క్రితం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దీనికి గాంధీ సెంటర్ అని పేరు వచ్చింది. ఈ విగ్రహాలను తొలగించి సమీపంలో రోడ్డు పక్కన స్థలంలో ఏర్పాటు చేసి, అక్కడ బొడ్డురాయి ఏర్పాటు చెయ్యాలని ఒక వర్గం ఇటీవల ప్రతిపాదించింది. దీన్ని మరో వర్గం తీవ్రంగా వ్యతిరేకించటమే కాకుండా, విగ్రహాలను తొలగించాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, జాతీయ నాయకుల విగ్రహాల సంరక్షణ కమిటీ పేరుతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ పరిణామాలు ఎటు దారి తీస్తాయోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

'కాల్వలా కైకలూరు సందు'

మండవల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండవల్లిలో కైకలూరు సందు కాలువను తలపిస్తోందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, జిల్లా కన్వీనర్ తెంటు అప్పారావు పేర్కొన్నారు. మండవల్లిలో మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ అయిన మండవల్లి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం కురిసినా కైకలూరు సందు, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, శివాలయం వీధి, పల్లపు బజారులో రోజుల తరబడి మురుగునీరు రోడ్లపై నిలబడి పోతున్నాయని వాపోయారు. అధికారులు, రాజకీయ నాయకులు, ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మండవల్లి గ్రామంలో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటుచేసి మురుగునీటికి పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. మండల అధ్యక్షుడు గంజాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వై. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అర్జునరావు, సభ్యులు పాల్గొన్నారు.

గాలి, వాన బీభత్సం



కాకరవాడలో ఇంటిపై కూలిన చెట్టు

ముదినేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో మంగళవారం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. రహదారులు జలమయం కాగా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు కాకరవాడలో జోగి శ్రీనివాసరావు ఇంటిపై కొబ్బరిచెట్టు కూలిపడి రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంటిలో వేరే గదిలో ఉన్న శ్రీనివాసరావు కుటుంబసభ్యులు హుటాహుటిన బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. విద్యుత్ తీగలు తెగిపోయాయి. ముదినేపల్లి - గుడ్లవల్లేరు రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. మైనర్ డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి.

ముసునూరులో భారీ వర్షాలు

ముసునూరు: అల్పపీడనం ప్రభావంతో ముసునూరు మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రహదారులు వాగులను తలపించాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూత, పిందెపై ఉన్న పత్తి పంటకు నష్టం వాటిల్లింది. తోట భూముల్లో సాగుచేసిన వరిపంట కోతకు రావడంతో ఈ వర్షం వల్ల నేల వాలాయి. మడుల్లో నీరు చేరి ధాన్యం మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నాటు పొగాకు నారుమడులు సైతం దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ వర్షాలు మరికొన్ని రోజులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమౌతోంది.

కరువు భత్యం జీవోలపై ఉద్యోగుల కన్నెర్ర!

(5వ పేజీ తరువాయి)

చెల్లింపు విషయంలో గందరగోళానికి గురి చేయడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను మోసం చేయడమేనని సంఘాలు విమర్శిస్తున్నాయి.

జీవోలు 60, 61లను సవరించాలి



-వి.రవికుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం డీఏ బకాయిల చెల్లింపు విషయంలో దాటవేత ధోరణిని ప్రదర్శిస్తోంది. 21 నెలల బకాయిలు రిటైర్‌మెంట్ నాడు చెల్లిస్తామని జీవోలో పేర్కొనడం దారుణం. 20 ఏళ్ల తర్వాత రిటైరయ్యే ఉద్యోగికి ఈ బకాయిల సొమ్ముకు వడ్డీ గాని, అవసరాలకు డబ్బును వాడుకొనే అవకాశం ఉండదు. తక్షణం జీవోలు 60, 61లను సవరించాలి.

రిటైర్‌మెంట్‌తో ఇస్తామనడం సరికాదు



షేక్ రంగావలి, రాష్ట్ర కార్యదర్శి, ఏపీటీఎఫ్.

డీఏ బకాయిలు చెల్లింపుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ అనుసరించిన తీరు బాధాకరం. 21 నెలల డీఏ బకాయిలు రిటైర్‌మెంట్‌తోపాటు ఇస్తామనడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదు. సీపీఎస్ వారి ప్రస్తావన తేకపోవడం దారుణం.

సవరణకు డిమాండ్

డీఏ బకాయిలను రిటైరైన తర్వాత చెల్లిస్తామని షరతు పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఇప్పటికే ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు 2027-28 ఆర్థిక సంవత్సరంలో బకాయిలను 12 విడతల్లో చెల్లిస్తామని మెలిక పెట్టడాన్ని ఖండిస్తున్నట్టు ఏపీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు తెలిపారు.

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నాలుగు విడతల డీఏల గురించి ఎదురుచూస్తున్న సమయంలో ఒకేఒక్క డీఏను దీపావళి సందర్భంగా విడుదల చేస్తున్నట్టు ప్రకటించి, అది కూడా ఎరియర్స్ చెల్లింపు విషయంలో ఉద్యోగి రిటైరైన తర్వాత లేదా మరణించిన తర్వాత చెల్లిస్తామనడం విడ్డూరంగా ఉందని డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఆక్షేపించారు.
- ప్రస్తుత అవసరాలకు ఇవ్వాల్సిన డీఏను రిటైర్మెంట్ తర్వాత లేదా మరణానంతరం ఇస్తామనడం అన్యాయమని ఏపీటీఎఫ్-1938 నాయకులు జి.కృష్ణ, రామ్మోహన్, మోహన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులకున్న నమ్మకాన్ని వమ్ముచేస్తూ 4 డీఏలకు కేవలం ఒక డీఏను ప్రకటించి నిరాశకు గురిచేశారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డి దొర ఆరోపించారు.
- సంప్రదాయానికి విరుద్ధంగా ఉన్న కరువు భత్యం జీవోలు 60, 61 వెంటనే సవరించాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- డీఏలకు సంబంధించి విడుదల చేసిన 60, 61 జీవోలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఇచ్చారా ? లేదా ? అధికారులు స్పష్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. రెండు జీవోల విడుదలపై సవరణ చేయాలని వారు డిమాండ్ చేశారు.

విద్యుత్ స్తంభాల్ని ఢీకొన్న కారు..

ఐదుగురికి తీవ్ర గాయాలు



కైకలూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కారు వేగంగా వస్తూ అదుపు తప్పి రెండు విద్యుత్ స్తంభాలను ఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. కైకలూరు టౌన్ పోలీసుల వివరాల ప్రకారం ఆదివారం రాత్రి మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన మున్నా, అభిషేక్, అవరాజు, సందీప్ కారులో రామ వరంలో తన స్నేహితుడైన బోడావుల నాగ వీర కుమార్ పుట్టినరోజు వేడుకలకు వెళ్లారు. వేడుకల అనంతరం అర్ధరాత్రి బోడావుల నాగవీరకుమార్‌తో కలిసి అదే కారులో కైకలూరు వస్తున్నారు. అప్పటికే వారు మద్యం సేవించి ఉన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కారు వేగంగా రావడంతో అదుపు తప్పి పల్టీలు కొట్టి కరెంటు స్తంభాలను ఢీకొట్టడంతో కారు నుజ్జయి కరెంటు స్తంభాలు విరిగి పడ్డాయి. కారులోని వారికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా 30 ఏళ్ల లోపు గల యువకులు. వీరిలో మున్నా మద్యం సేవించి కారు డ్రైవ్ చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై యువకుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరంతా విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

క్రైమ్ కార్నర్

బావిలో మృతదేహం స్వాధీనం

నూజివీడు టౌన్: నూజివీడు పట్టణం కొండయ్య సత్రంలోని బావిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. నూజివీడు శ్రీనివాసా సెంటర్ సమీపంలోని దేవదాయ ధర్మదాయశాఖకు చెందిన కొండయ్య సత్రంలో నూజివీడు అజరయ్యపేటకు చెందిన తాళ్ళూరి నాగరాజు (50) అద్దెకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సత్రంలోని బావిలో నాగరాజు మృతదేహాన్ని గమనించిన సత్రంలో అద్దెకుంటున్న వారు నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి నూజివీడు ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



చిన్నంనాయుడు

కైకలూరు: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కైకలూరు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను మంగళవారం కేసు నమోదు చేశారు. ఈ నెల 19న కైకలూరు వెలమపేటకు చెందిన వంగపండు చిన్నం నాయుడు (62) భార్యపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులతో కలిసి గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య మంగళవారం టౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే సెల్ నంబర్లు 94407 96434, 89854 88626కు సమాచారాన్ని అందించాలన్నారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు



సంజీవ్ వర్ధన్

మండవల్లి: మండలంలోని అయ్యవారి రుద్రవరం గ్రామానికి చెందిన వట్టిప్రోలు మార్తరాజు తన చిన్న కుమారుడు సంజీవ్ వర్ధన్ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం సంజీవ్ వర్ధన్ ఏలూరులోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడని, శనివారం కళాశాలకు హాజరుకాలేదని ఫోన్ రావడంతో కుమారుడిని మందలించగా, ఆదివారం రాత్రి నుంచి కనబడడం లేదని తెలిపారు. మండవల్లి పోలీసుస్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై రామచంద్ర రావు కేసు నమోదు చేశారు.

కోడిపందేల శిబిరాలపై దాడులు

కలిదిండి: పరసావానిపాలెంలో కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకుని, రూ.1400 నగదు, పుంజును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే 94407 96435కు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ముదినేపల్లి: చిగురుకోటలో సోమవారం కోడిపందేలు వేస్తున్న మండవల్లి మండలానికి చెందిన ఎస్. శివనాగరాజు, వి. పాండు రంగారావును అదుపులోకి తీసుకుని రూ.1200, రెండు పుంజులు, కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై దాడి..

మండవల్లి: మండలంలోని గన్నవరం శివారులో పేకాట శిబిరంపై ఎస్సై రామచంద్రరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.6500 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు.

లైసెన్సు లేకుండా బాణసంచా అమ్ముతున్న..

ముదినేపల్లి: చిగురుకోటలో అనుమతులు లేకుండా రోడ్డుపై మందుగుండు సామగ్రిని విక్రయిస్తున్న డి. బాలకృష్ణ, డి. సత్యనారాయణమూర్తి అనే వ్యాపారులపై పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి వారి వద్ద ఉన్న మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎంఈవో-1 ఎం. శ్రీనివాస్‌కు, డీపీఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. నాగేశ్వరరావు, మండల కార్యదర్శి టి. రామారావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 2025 డీఎస్సీ ద్వారా ఎంపికై మండలంలో వివిధ పాఠశాల్లో చేరిన ఉపాధ్యాయులకు అవసరమైన ఐడీలు క్రియేట్ చెయ్యాలని, క్లస్టర్ కాంప్లెక్స్‌లలో సంయుక్త కార్యదర్శులను నియమించటంలో సదరు కాంప్లెక్స్ చైర్మన్లు ప్రభుత్వ నిబంధనలు పాటించేలా చూడాలని, ఉపాధ్యాయులకు మెసేజ్‌లు ఎంఈవోల ద్వారానే పంపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

ఆగిరిపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పారావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో-1 హేబేలు మంగళవారం సందర్శించారు. పాఠశాల ఆవరణ, కిచెన్ గార్డెన్, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పరిశీలించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులు వి. పద్మశ్రీ, సీహెచ్‌ఎం. లక్ష్మీకుమారి కృషిని ప్రశంసించారు. క్లస్టర్ సీఆర్పీ షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

3న మున్సిపల్ కార్మికుల సమ్మె

నూజివీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నవంబరు 3న నిర్వహించతలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు కోరారు. మంగళవారం నూజివీడు మున్సిపల్ కార్మికులతో కలసి మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ ప్రకటించి ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, మున్సిపల్ పరిధి పెరగడంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని కోరారు. నూజివీడు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాల విజయ్, సుదర్శనం, రంగారావు, శ్రీను, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపు

కలిదిండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కలిదిండి బస్టాండ్ ప్రధాన రహదారిపై రోజుల తరబడి నిల్వ ఉంటున్న వర్షపు నీటిని సర్పంచ్ మారుతీ ప్రసన్న, సిబ్బంది మంగళవారం తొలగించారు. రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయినేజీల్లో తూములు పూడుకుపోవటంతో కొద్దిపాటి వర్షానికే రహదారి నీట మునిగి చెరువును తలపిస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో ఎక్స్‌కవేటర్‌తో డ్రెయినేజీలో పూడికతీసి కొత్త తూములను ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాట్రాయిలో రహదారి మరమ్మతులు ప్రారంభం



చాట్రాయి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తపూరు-బూరుగుగూడెం ఆర్‌అండ్‌బీ రహదారి (సీబీ రోడ్డు)పరిధిలో ఉన్న చాట్రాయిలో రహదారి మరమ్మతు పనులు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభించారు. చాట్రాయి గొల్లగూడెం నుంచి పీహెచ్‌సీ వరకు రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి వాహనాలు దిగబడి వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ద్విచక్రవాహనాలు పడిపోయి పలువురు గాయాలపాలయ్యారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు సైతం ప్రచురితం అయ్యాయి. ఈ రోడ్డు మరమ్మతులకు మంత్రి పార్థసారథి చొరవతో రూ. 3 కోట్లు నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదు. రోడ్డు దుస్థితిపై పలువురు టీడీపీ నాయకులు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళటంతో పనులు ప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. పనులు ప్రారంభించటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుంతలగూడెం పంచాయితీ!

(5వ పేజీ తరువాయి)

అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో కనకాద్రిపురం గ్రామస్థులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఇతర అధికారులు రెండు గ్రామాల ముఖ్య నాయకులతో మరోమారు చర్చలు జరిపారు. రెండు గ్రామాల ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. మరోవైపు త్వరితగతిన భవన నిర్మాణ చేపట్టకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయని రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.